# ఆకలి

నరసయ్య దొర మాటలకు తలవూపటమే పనిగా పెట్టుకున్న పెద్ద మనుషుల కాళ్ళ చెప్పులరిగినై. రామయ్యవద్దకు రాయబారాలు తేలేక. మంచి ధర ఇప్పిస్తామన్నారు. భూమికి బదులు ఇమ్మడి భూమి ఇప్పిస్తా మన్నారు. ఊళ్ళో పెద్ద తోట ఉంటే ఊరికి మంచిదన్నారు. ఎన్నో తీర్ల ప్రయత్నించినా లాభం లేకపోయింది. నెత్తురున్న చెమటగా చేసి పొలం చేసుకున్న భూమి వదలటానికి మనసొప్పలేదు రామయ్యకు. తల్లిని గడ్లో వేసినాడు వచ్చినంత ఆపుకోలేని ఏడ్పొచ్చింది. తల్లిపోయినా భూమి తల్లి తన్నొదిలి పోదని నమ్ముకున్నాడు. తన కడుపుజీల్చి బాధపెట్టినా భరించి బంగారు వన్నె జొన్నలిస్తున్నది గుమ్ముల నిండుగా. ఊళ్ళో అందరికన్నా మంచిరైతుగా చేసి తన బ్రతుకుపడవ నొడ్డెక్కించింది. అప్పులన్నీ దీరిపోయినై. ఇంక ముందు పండిన గింజలన్నీ యింట్లోనే పోసుకోవచ్చు. హాయిగా బ్రతకొచ్చు. పెద్ద పిల్ల పెండ్లి చేయవచ్చు అని ఎన్నో కమ్మటి కలలు కన్నాడు. కాని నర్సయ్యగారి రాయబారాలతో నిద్ర మత్తొదిలినట్లయి, కలలన్నీ కరిగిపోయినై. చింతా, విచారం, పొంగివచ్చే కోపం, ఏమీ చేయలేని నిరాశ దాని ఫలితంగా గుండెలు జీల్చుకొని గొంతు దాకా వచ్చే ఏడ్పు సిద్ధమైంది.

ఆఖరు రాయబారంగా కిష్టయ్య పంతులు వచ్చాడు. ఈయన వూళ్ళో పట్వారీ. రామయ్యతో పాటు చిన్నతనంలో ఎల్లయ్యా, మల్లయ్యా, పేర్ల నుండి ఎరుసు లెక్కలవరకు చదువుకున్న బాపతు. చిన్నతనం స్నేహం, చనువును వుపయోగించి కార్యం సాధించడానికి వచ్చాడీ కరణం బిడ్డ.

కిష్ట : ఇదిగో, రామయ్యా ! నీ భూమికి పెద్దమనిషి దిష్టి తగి. లింది. నీ బాగుకోరేవాణ్ణి గనుక చెప్తుతున్నా. నీ ధోరణేం బాగుండలేదీ. మాట్లాలో.

రామ : పంతులూ ! నీవన్నా న్యాయం మాట్లాడ్తావేమో నను కున్నా. నీవంటి వాండ్లయినా వారికి చెప్పకపోతే ఎట్లా ?

కిష్ట : ఈ మామ్లాలో ఎవరుజెప్పినా వినేటట్లు లేదు భై !

రామ : కన్నతల్లి వోలె కాపాడిన భూమిన్నే నమ్మలేను పంతులూ! పిల్లాదిమేర ఎండవానకు కష్టపడి పంటకు మళ్ళించుకొన్న భూమిపోతే మా బతుకేం గావాలె ? చెప్పండి !

కిష్ట : చూడు, రామయ్యా ! ఇంత మంకు మంచిదికాదు. మంచికే మంచోడాయన. వెంకయ్య తరీ భూమి సంగతి గుర్తుండొచ్చు నీకు.

రామయ్య గుండెల్లో గడ్డపార గుద్దినట్లయింది. సేరీ ప్రక్కన వున్న వెంకయ్య రెండెకరాల తరీ,దాన్ని వదులుకోవటానికి వెంకయ్య బడ్డ తాపత్రయం, చివర కా భూమి సేరీ భూముల్లో పాలల్లో పంచదార వోలె చల్లగా కరిగిపోవటం, యీ కరిగించటానికి పంతులుగారు చేసిన సహాయం సర్కార్లో మొత్తుకుంటే జిల్లాలోగల న్యాయ దేవతలకు కూడా పాపం వెంకయ్య రెండెకరాల భూమి పత్తా దొరక్క పోవటం, చివర కతడు కూలీ చేసుకొని బతకడానికని బెజవాడవైపు పోయిన సంగతులన్నీ తోలు బొమ్మలాటవలె కండ్లముందు గిర్రున తిరిగినై. తనకు కూడా అదేగతి పట్టదుగదా అన్న ఆలోచన పాపం మనస్సులో మెరుపువలె మెరిసి గుండెలో పిడుగు బడ్డట్టయింది. అయినా దేవుడున్నాడు. తన విషయంలో పంతులు గూడా అంత అన్యాయానికి రాకూడదనుకొని పంతులుగారి నడిగాడు.

వెంకయ్య భూమి పంచాయతీ అప్పుడు చాలా అన్యాయం జర్గింది పంతులూ ! సర్కారీ కాయిదాలన్నీ దొరగారి కనుకూలంగా దిద్దుడైనై. పిల్ల పిల్ల తరం నాటినుండనుభవించిన భూమి ఖజ్జా సాక్ష్యం దొరకడం కష్టమైపోయింది.

కిష్ట : డబ్బుంటే కానిపని లోకంలో లేదు. కొండమీది కోతి దిగుతుంది.

రామ : వెంకయ్య పంచాయి తప్పుడంటే ఎవ్వరికి సరిగ పావులి బొక్కమీద రశీదులుండేవికావు. నోటి పతేరామీద వెళ్ళేది. వెంకయ్య పంచాయితితో మేమందరం పావులీ బొక్కలమీద రశీదులు తీసుకుంటున్నాము. ఇప్పుడేం డోకాలేదు కదా !

పం : ఏదో పోనీ ! అయిపోయిన పంచాయితితో ఇప్పుడేంపని ? నే నొచ్చిన పని చెప్పు. ఆయన డబ్బు గల్లోడు. అధికార్లంతా ఆయన చేతిలో వాళ్ళు. వాళ్ళ దావతులకోసం ఏటేటా మన దగ్గర వసూలై యే పట్టీ నీ కెరుకేనాయె. పచ్చినోడల్లా ఆయనింట్లోనే దిగుతడు. నా సంగతి చూడరాదూ ! పొద్దున మోత్తల్ (Suspend) చేసి పొద్దుగూకంగ బహాల్ (Reinstatement) చేసిండు, మొన్నొచ్చిన తహశీల్దారుడు. పెద్దోళ్ళతో కంటు మంచిదికాదు. బతికుంటె బలుసాకు తినొచ్చు. నేను చెప్పితే విను.

రామ : ఊళ్లోవున్న మంచి భూములన్నీ వీండ్ల కళ్ళల్లో పెట్టుకుంటె, మావంటివాండ్లం మంట్లో గలిసిపోవాల్నా, అని తీవ్రంగా అన్నాడు.

'చేసుకున్నంత గుడువు మహాదేవా' అని పంతులు దారిపట్టిండు.

# 2

ఆవిటి మొదటి దినాలు. రైతుబిడ్డల కవి పండుగ రోజులు. తమ ముందు జీవితాల కీనాడు కలకలలాడే ముఖాలలో విత్తనాలునాటుకుంటారు. ఎప్పుడేవేళ ప్రమాదం గంట మ్రోగుతుందో అని రామయ్య గుండెల్లో భర్తీబండ్లురికినట్టయితున్నది. ఆవిటి మొదటినాడుండాల్సిన ఆ సంతోషమే లేదు. దొరవారితో తనకు వచ్చిన మాటపట్టింపు రాత్రిళ్ళలికిపడి నిద్రలేచే పరిస్థితికి తెచ్చింది.

ఆనాడాదివారం. అరకలుగట్టుకొని రామయ్య భూమిలోకి పోయారు. ప్రక్కనే తోట దున్నిస్తున్న దొరవారి కన్నుసైగతో ఒక్కొక్క నాగలే రామయ్య భూమిలోని కొస్తున్నది. నిర్దాక్షిణ్యంగా భూమి తల్లి గుండెలు

జీలుస్తున్నారు దుర్మార్గులు. దొరవారు రామయ్య దిక్కు కొరచూపులు చూస్తున్నారు.

రామయ్య కాళ్ళు కడుపులో జొరబడ్డయి. గుండెల్లో బండబడ్డది. పట్టపగలు ఏమిటీ అన్యాయం ? ఇంత తెగించిందే అందరికీ న్యాయం చెప్పటానికి తరాజు పట్టుకొన్న దొర! నా భూమే నా చేతుల్లోనుండి పోవటమే ? కాళ్ళకింది మట్టి కదిలిపోతున్నది. గుండెల్లో క్వెట్టా, బీహారు భూకంపాలు వచ్చినై. ఈ లోకంలో న్యాయంలేదా ? దేవుడే వుంటే, ప్రహ్లాదుణ్ణి రక్షించటాని కొచ్చినట్టు నా యీ భూమిలో నుండి ఉద్భవించి కొరచూపులు చూచే వీణ్ణి, వీనికోసం నానాగడ్డి కరవటానికి సిద్ధమయే ఈ దుర్మార్గులను ఎందుకు భస్మం చేయకూడదు ? తాతలనాటినుం డనుభవించిన భూమి యీ నాటితో చేయిజారి పోవటమే అని మనసులో మథన పడుతూ అదర్తున్న పెదవితో, వణుకుతున్న కాళ్లు, కంఠస్వరముతో తన అరకనాపి అరకల కడ్డంబోయి నిలబడి,"దొరా నీకాళ్ళు మొక్తా నన్నెందుకు తిప్పలబెడ్తా. నీ పాదాల నీడ నన్ను ఇట్లబ్రతుకనియ్యి" మని దీనంగా ఎదుటివాళ్ళకు గుండెలే వుంటే కరిగిపారే టట్టుగా అన్నాడు.

కొరచూపులతో విషపునవ్వు నవ్వుతూ "యీ నాటికి నీవు మొనగాడివైనా !" అన్నాడు దొర. ఆగిన అరకలు దొరవారివంక చూచినై. 'హూ' అన్నాడు దొర. తోట గుడిసెలో బాగా తాగివున్న అరబ్బులు సేవకపోండ్లు విచ్చుకత్తులతో తయారైనారు. "చూస్తరేం !" అన్నాడు దొర. రామయ్యను చుట్టుముట్టిందీ సాయుధసైన్యం. పాపం నిరాయుధుడైన రైతు విచ్చుకత్తుల భయానికి లొంగినాడు. పట్టుకొని అక్కడేవున్న చెట్టుకు పెడరెక్కలు విరిచి కట్టేశార్హు. చుట్టుపట్ల పనిచేసుకుంటున్న రైతులీ దుర్మార్గాన్ని చూడలేక ఏమి అన్యాయమిది అనటానికి గుండెలులేక ఏం ప్రమాదం విరుచుక పడుతుందో మీద అని తమతమఇండ్లకుపారిపోయారు. అరబ్బులు వగైరాలు దొరవారు చేయించిన మేకపలావు తింటూ పహరాయిస్తున్నారు. దొరవారు కొంటెనవ్వు నవ్వుతూ వెట్టి కుమ్మరించిన నిమ్మమజ్జిగ దాగుతూ "బేవు" మంటున్నాడు. అరకలు విజయం సంపాయించిన సైన్యాలవలె సాగినై. రామయ్య పశువులు కూడా అరకలు

దున్నినై. జరిగే ఘోరాన్నిపటానికి దేవుడూ అవతారమెత్తి రాలేదు, భూమి కూడా పగిలి బద్దలు కాలేదు. కాని రామయ్య మనసులో లెక్కలేనన్ని తుఫానుల్యూ, అగ్నిపర్వతాలూ—

# 3

చేసేదేమున్నది. ఊళ్ళోవాళ్ళందరికీ పాపం రామయ్యమీద సాను భూతి వున్నా, అయ్యోపాపం అనటానికి ఒకనికీ ధైర్యం చాలలేదు. తాగి తందనాలాడే అరబ్బులు, సేవకులు రామయ్యను, ప్రజలను ఒక కంట కని పెడుతున్నారు. భూమి దున్నినాక విడుదలైన రామయ్య ఒక రాత్రి ఎవ్వరికీ తెలియకుండా బస్తీకి లేచిపోయి న్యాయదేవత ద్వారం తట్టాడు. పెద్ద మనిషి న్యాయస్థుడైన దొరగారేమిటి ఇటువంటి అమానుషమైన పని జరపడం యేమిటి? అని మొదటికి మొదలే మనస్సులో అనుకొన్నది.

'అబ్బాయ్, నేనైతే జరిగిన సంగతి చూడలేను. చూడజాలను. చెవు లున్నాయి, వింటాను. ఆపైన నీయదృష్టమన్నది ఆ న్యాయదేవత. సాక్ష్యం రావటానికి ఎవరూ ధైర్యం చేయలేదు. ఊళ్ళో సర్కారి కాయిదాలు దిద్ద టానికీ వీలుగాలేదు. ఉన్నదున్నట్లు దొరవారికి విరుద్ధం పల్కలేదు. సందిగ్ధావస్థలో పడ్డాడు కిష్టయ్య పంతులు. ఆరు వందల ఖర్చుతో కిష్టయ్య పిచ్చివాడైనట్టు డాక్టరు వద్ద కాగితం తయారైంది. ఇంకా కొన్ని వంద లతో దొరవారికి కోరిక నెరవేరింది.

ఈ సారి కూడా వెంకయ్యకు పట్టిన గతే రామయ్యకు పట్టింది. సాక్ష్యం బాగాలేదు గాబట్టి భూమి దొరవారిదే అన్నది న్యాయ దేవత. నిజ మైన సంగతి గదా, విజయం నాదేనని గట్టినమ్మకంతో వున్న రామయ్యా నవనాళ్ళూ కృంగిపోయినై. వూరు వదలి పోయి నాడెటో యీ నాటికీ జాడరాలేదు.

పాపం దొరవారు మొకద్దమా ఖర్చులు వసూలు కాలేదని దిగులు పడుతున్నాడు.

భూమి మీద వచ్చే ఆదాయం జీర్ణమై ఆకలి వదలలేదు, యీ మానవ పులికి.

ఇటువంటి రామయ్యలు ఎందరైతే ఆకలి దీరుతుంది!

(1946)